సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 26 । జూన్ । 2024



వానాకాలం పశువులు జాగ్రత్త

వర్షాకాలంలో పశువులకు ప్రాణాంతక వ్యాధులు సోకే ప్రమాదముంది. గొంతువాపు, పొదుగువాపు వంటి వచ్చే అవకాశముందని పశు వైద్యులు చెబుతున్నారు. 8లో ▸



అత్యాచారం కేసులో అరెస్ట్

బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని ముదినేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. 8లో ▸

బడి సంచి భారం

విద్యార్థులకు పుస్తకాల సంచి భారంగా మారుతోంది. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి సంచి పరిమాణాన్ని తగ్గిస్తూ కేంద్రం సూచనలు చేసినా అమలు కావడం లేదు.



8లో

న్యూస్‌రీల్

రైల్వే సమస్యలపై వినతులు



రైల్వే అధికారికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): రద్దయిన రైళ్ల స్థానంలో ప్రత్యామ్నాయ రైళ్లను వేయాలని కోరుతూ స్టేషన్ సూపరింటెంటెండ్‌కు భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీ డెవలప్‌మెంట్ కమిటీ, సిపిఐ, సీపీఎం, లయన్స్ క్లబ్, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందించారు. హౌసింగ్ బోర్డు డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు సరిపిడకల రామారావు, కార్యదర్శి ముదునూరి సూర్యనారాయణరాజు మాట్లాడుతూ రద్దయిన రైళ్ల కారణంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని కోరారు.

దళితులపై దాడిని నిరసిస్తూ ఆందోళన



కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన

భీమవరం: భీమవరం మండలం వెంపలో దళిత పేటలపై దాడి చేసి, దళిత యువతిపై అత్యాచార యత్నం చేసిన వారిని తక్షణం అరెస్టు చేసి, దళితులకు రక్షణ కల్పించాలని కెవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపించాలని మంగళవారం ఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. క్రాంతిబాబు, జై భీమ్ సైనిక దళ్ అధ్యక్షుడు మీసాల జయరాజు మాట్లాడుతూ వెంప పెదపేటపై ఈ నెల 23న బీసీ కులానికి చెందిన కొంతమంది యువకులు దళిత యువకులతో వాగ్వివాదానికి దిగి దాడి చేశారని ఆరోపించారు. మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి భయభ్రాంతులకు గురి చేశారన్నారు. వారిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు అండగా ఉంటానని, దోషులను శిక్షిస్తామని ఎస్పీ హామీ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో కెవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బత్తుల విజయ్‌కుమార్, సీఐటీయూ మండల నాయకులు పెద్దపాటి శ్యామల, ఇంజేటి శ్రీనివాస్, ఇంజేటి శ్రీమూర్తులు, బండి రాజు, ప్రభాకర రావు, చిరంజీవి, జి.అశోక్, చిలకపాటి ఆదాము, బి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డీస్ ల్యాబ్ ఉద్యోగాలకు ఎంపిక



రాత పరీక్షల్లో పాల్గొన్న సీఆర్ఆర్ విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని సీఆర్ రెడ్డి అటానమస్ కళాశాలకు చెందిన 40 మంది విద్యార్థులు డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మంగళవారం సీఆర్ఆర్ కళాశాలలో సంస్థ ప్రతినిధులు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. 2024 విద్యాసంవత్సరంలో బీఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఈ ఎంపికలు నిర్వహించగా కళాశాలకు చెందిన 81 మంది పాల్గొన్నారు. ఈ మొత్తం 40 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రతినిధి తెలిపారు.

నారాయణ పాఠశాలలో బుక్స్ అమ్మకంపై ఆందోళన



పుస్తకాలు ఉంచిన గదికి సీలు వేయిస్తున్న ఎంఈఓ-2 సీతారామయ్య

ఆకివీడు: ప్రైవేటు విద్యా సంస్థ నారాయణలో విద్యార్థులకు పుస్తకాలు అమ్ముతున్నారని ఎస్ఎఫ్ఐ మంగళవారం ఆందోళన చేపట్టింది. ఆకివీడులో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఆందోళన నిర్వహించారు. సమాచారం అందుకున్న మండల విద్యాశాఖ అధికారి-2 సీతారామయ్య అక్కడికి చేరుకున్నారు. ఎస్ఎఫ్ఐ నేతలతో మాట్లాడిన అనంతరం పాఠశాలలో పుస్తకాలు ఉన్న గదిని గుర్తించి సీలు వేయించారు. బుధవారం తాళం తీసి పరిశీలిస్తామని నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ నారాయణ విద్యా సంస్థ విద్యా సామగ్రిని రూ.7 వేల నుంచి రూ.15 వేల వరకు విక్రయిస్తోందని, విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా చర్యలు తీసుకోలేదని చెప్పారు.

రైలు ప్రయాణం.. భారం

- రద్దయిన ప్యాసింజర్లు నేటికీ పట్టాలెక్కని వైనం
- ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలకు కత్తెర
- స్లీపర్ కోచ్‌ల కుదింపుతో సామాన్యులకు ఇక్కట్లు
- 20కి పైగా ఎక్స్‌ప్రెస్‌ల రద్దుతో అవస్థలు





ఏలూరు (టూటౌన్): పేద, మధ్య తరగతి ప్రజలు ఎంత దూరమైనా తక్కువ ఖర్చుతో ప్రయాణించాలంటే రైలు ప్రయాణమే అనువుగా ఉండేది. ఇప్పుడు ఆ ప్రయాణం కాస్తా ఖరీదైపోయింది. దీంతో సామాన్యులు రైలు ప్రయాణమంటే నిట్టూరుస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీల కుదింపుతో పాటు, స్లీపర్ బోగీల సంఖ్య తగ్గించడం.. కరోనా సమయంలో రద్దు చేసిన పలు ప్యాసింజర్ రైళ్లు ఇప్పటికీ పట్టాలు ఎక్కకపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలకు రైలు ప్రయాణం కష్టంగా మారింది.

ప్యాసింజర్ రైళ్ల రద్దుతో భారంగా ప్రయాణం

కరోనా సమయంలో జిల్లాలో నడిచే పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు పూర్తిగా రద్దు చేశారు. దీంతో నిత్యం వీటిలో ప్రయాణించే చిరు వ్యాపారులు, ఉద్యోగులు, కార్మికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గతంలో ఏలూరు స్టేషన్ నుంచి ఉదయం 6 గంటలకు ప్యాసింజర్ రైలు, ఉదయం 8 గంటలకు ఫాస్ట్ ప్యాసింజర్ రైళ్లు విజయవాడ వెళ్లేందుకు ఉండేవి. విజయవాడ నుంచి సాయంత్రం 5 గంటలకు, 6 గంటలకు అందుబాటులో ఉండేవి. ఇవి రద్దు కావడంతో బస్సులకు వెళ్ళాల్సి వస్తోంది.

రాయగడ రద్దుతో ఇక్కట్లు

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన వేలాది మంది జీవనోపా ధికోసం వచ్చి ఏలూరు, తాడేపల్లిగూడెం వంటి పట్టణాల్లో స్థిరపడ్డారు. వీరంతా గుంటూరు-రాయగడ మధ్య నడిచే ప్యాసింజర్ రైలులో తమ సొంత ప్రాంతాలకు తక్కువ ఖర్చుతో వెళ్లేవారు. ఈ రైలును రద్దు చేయడంతో ఉత్తరాంధ్రకు వెళ్ళేందుకు ప్రజలు అనేక ఇబ్బంది పడుతున్నారు.

భక్తులకు తప్పని అవస్థలు


గతంలో కాకినాడ-తిరుపతి మధ్య ప్యాసింజర్ రైలు నడిచేది. ఈ రైలును సైతం రద్దు చేయడంతో తిరుపతి వెళ్లేందుకు వీలు లేకుండా పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే నిడదవోలు-కడియం స్టేషన్ల మధ్య ఆధునికీకరణ పనుల పేరుతో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేయడంతో రిజర్వేషన్లు చేసుకున్న ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు

నిడదవోలు-కడియం స్టేషన్ల మధ్య ఆధునికీకరణ పేరుతో 20కి పైగా ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆకస్మికంగా రద్దు చేశారు. ఈ నెల 24 నుంచి ఆగస్టు 10 వరకూ ఈ రైళ్లు పట్టాలపై కనిపించవు. ఈ రైళ్లలో ఎంతో డిమాండ్ ఉన్న రత్నాచల్, సింహాద్రి, జన్మభూమి వంటి ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ రైళ్లు ఉండటం గమనార్హం. ఈ రైళ్లలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, కొవ్వూరు వంటి పట్టణాల నుంచి నిత్యం రాకపోకలు సాగించే వేలాది మంది ప్రయాణికులున్నారు. ఏలూరు రైల్వే స్టేషన్ నుంచి నిత్యం 50కి పైగా రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. రోజు 6 నుంచి 7 వేల వరకూ రాకపోకలు సాగిస్తుంటారు. వీరందరూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఆగస్టు 10 వరకు రద్దయిన రైళ్లు

- గుంటూరు-రాయగడ(17243)
- గుంటూరు-విశాఖపట్నం- సింహాద్రి ఎక్స్‌ప్రెస్
- విజయవాడ-విశాఖపట్నం-రత్నాచల్ ఎక్స్‌ప్రెస్
- గుంటూరు-విశాఖపట్టణం-ఉదయ్ ఎక్స్‌ప్రెస్
- విశాఖపట్నం-తిరుపతి- డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్
- విజయవాడ-కాకినాడ-విజయవాడ ప్యాసింజర్
- రాయగడ-గుంటూరు- రాయగడ ఎక్స్‌ప్రెస్
- విశాఖపట్నం-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు.



ప్రజలను దోచుకుంటున్నారు



రైల్వే ప్రైవేటీకరణలో భాగంగా ప్యాసింజర్ రైళ్లను తగ్గించేశారు. గతంలో విజయవాడ, విశాఖపట్నం వెళ్లేందుకు ప్యాసింజర్ రైళ్లు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం అన్నీ రద్దు చేశారు. రాయగడ ప్యాసింజర్‌ను ఎక్స్‌ప్రెస్‌గా మార్చి డబ్బులు దోచుకుంటున్నారు. బీజేపీ ప్రభుత్వం బుల్లెట్ ట్రిన్లు, సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల పేరుతో గ్లోబల్ ప్రచారం చేసుకుంటుంది.

– పి.కిషోర్, సీపీఎం నగర కార్యదర్శి, ఏలూరు

రాయగడ రద్దు సరికాదు



మాది విజయనగరం జిల్లా బొబ్బిలి. మా బంధువులు విజయనగరం జిల్లాలోనే ఉండటంతో అప్పుడప్పుడూ వెళ్లేవారం. మాకు రాయగడ ప్యాసింజర్ ఎంతగానో ఉపయోగపడేది. రాత్రి ఎక్కితే తెల్లవారేసరికి చేరుకునేవాళ్లం. గత నాలుగేళ్ల నుంచి రాయగడ ప్యాసింజర్ రైలును ఎక్స్‌ప్రెస్‌గా మార్చి టిక్కెట్ రేటుతో పాటు సమయం మార్చేశారు.

– ఎం.సింహాచలం, ఏలూరు

అకస్మాత్తుగా రద్దు దారుణం



చాలా రోజుల ముందే రిజర్వేషన్లు చేయించుకున్నాం. ఇలా అకస్మాత్తుగా రద్దు చేయడం దారుణం. ముందుగా ప్రకటించి రద్దుచేసి ఉంటే ఇబ్బంది ఉండేది కాదు. రైళ్ల రద్దుతో సాధారణ, రిజర్వేషన్ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాలకు రైళ్లను అకస్మాత్తుగా రద్దు చేయడం దుర్మార్గం.

– జి.వెంకయ్య, న్యాయవాది, చింతలపూడి

రూ.352కు చేరిన వర్జీనియా ధర



జంగారెడ్డిగూడెం వేలానికి వచ్చిన పొగాకు బేళ్లు

జంగారెడ్డిగూడెం: వర్జీనియా పొగాకు ధర కిలో రూ.352కు చేరింది. గత ఏడాది అత్యధికంగా రికార్డు స్థాయిలో కేజీకి రూ.288 లభించింది. ఈ ఏడాది వేలం ప్రారంభమైన కొద్ది రోజులకే గత ఏడాది ధరను దాటిపోయింది. ఈ ఏడాది మార్చి 6న వర్జీనియా పొగాకు వేలం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల్లో ప్రారంభమైంది. ప్రారంభ ధర కేజీకి రూ.240 లభించింది. క్రమేపీ పెరుగుతూ ఈనెల 20న రూ.266కు చేరుకుంది. 22 నాటికి రూ. 272కు చేరుకోగా, 24న రూ. 287, 25న రూ.300 మార్కు దాటి రూ.303 లభించింది. క్రమంగా పెరుగుతూ మంగళవారం నాటికి రికార్డు ధర నమోదు చేసింది. ఎస్ఎల్ఎస్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో నాలుగు కేంద్రాల్లో రూ.352 గరిష్ట ధర పలికి రైతుల మోముల్లో ఆనందాన్ని నింపింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం-1, జంగారెడ్డిగూడెం-2, దేవరపల్లి వేలం కేంద్రాల్లో గరిష్టంగా కేజీ ఒక్కింటికి వర్జీనియా ధర రూ.352 పలుకగా, గోపాలపురం కేంద్రంలో రూ.6 తక్కువగా రూ.346 పలికింది. ఎస్ఎల్ఎస్ ఏరియాలో ఇప్పటి వరకు రూ.326.88 సగటు నమోదయ్యింది. ప్రస్తుత ధరల ధోరణి చూస్తుంటే గరిష్ట ధరలతో పాటు సగటు ధరలు మరింత పెరుగుతాయని రైతులు ఆశతో ఉన్నారు. లో గ్రేడ్, మధ్య తరగతి గ్రేడ్ పొగాకు బేళ్లు వెంటనే వేలం కేంద్రాలకు తరలించి అమ్ముకోవాలని అధికారులు చెబుతున్నారు. ధర బాగుండటంతో లోగ్రేడ్, మధ్య తరగతి గ్రేడ్‌లకు మంచి ధర లభిస్తుందంటున్నారు.

కొయ్యలగూడెం కేంద్రంలో..

కొయ్యలగూడెం: సోమవారం అంకాలగూడెం క్లస్టర్‌కు సంబంధించిన గ్రామాల రైతులు 970 బేళ్లు వేలం కేంద్రానికి తీసుకురాగా అందులో 778 బేళ్లను కంపెనీలు పోటీపడి కొనుగోలు చేశాయి. ఇంతవరకు 84 రోజులకు కొనుగోళ్లు చేయగా 42 కంపెనీలు వేలంలో పాల్గొన్నాయి. ఇంతవరకు సరాసరి కిలో రూ.318 రూపాయలకు చేరింది.

భీమవరంలో కల్కి సినిమా సందడి



భీమవరంలో కార్లతో కల్కి పేరు వచ్చేలా ఏర్పాటు చేసిన దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణంలో ప్రభాస్ సినిమా రిలీజ్ అవుతుందంటే అభిమానులు సందడి అంతా ఇంతా కాదు. పట్టణంలో పెద్ద ఎత్తున బ్యానర్స్ కట్టి, మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకుంటారు. ఈ నెల 27న ప్రభాస్ నటించిన కల్కి చిత్రం రిలీజవుతున్న నేపథ్యంలో మంగళవారం ప్రభాస్ అభిమానులు సందడి చేశారు. భారీ ఎత్తున బ్యానర్లు కట్టడమేగాక కార్లతో ర్యాలీ చేశారు. యూత్ క్లబ్ రోడ్డులోని కె.కన్వెన్షన్ హాలు వద్ద 17 కార్లతో కేఏఎల్‌కేఐ(కల్కి) అనే అక్షరాలు ఏర్పాటుచేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

పప్పులు కొనలేం!

- మార్కెట్‌లో దడ పుట్టిస్తున్న పప్పుదినుసుల ధరలు
- కందిపప్పు కిలో రూ.175
- మరింత పెరగవచ్చంటున్న మార్కెట్ వర్గాలు





తాడేపల్లిగూడెం: పప్పుదినుసుల ధరలు మండిపోతున్నాయి. కందిపప్పు ధరలు చుక్కల్ని అంటగా.. శెనగపప్పు, మినపప్పు ఇలా అన్ని రేట్లు మోత మోగిస్తున్నాయి. ఎన్నికల సమయంలో కేంద్రం పప్పుల దిగుమతులపై దిగుమతి సుంకం 15 శాతం ఎత్తేసింది. దీంతో ఎన్నికల సమయంలో ధరలు కాస్త తగ్గాయి. ఎన్నికలు ముగియగానే ధరలు మంట పుట్టిస్తున్నాయి. ఏడేళ్ల గరిష్టానికి మార్కెట్లో పప్పుల ధరలు చేరాయి. మరో పది రోజుల్లో కిలో 20 శాతం పెరిగే అవకాశముంది. కందిపప్పు కిలో రూ.200కు చేరేలా కనిపిస్తోంది. 2016లో శెనగపప్పు కిలో రూ.వంద దాటింది. ప్రస్తుతం శెనగపప్పు కిలో రూ.90గా ఉంది.

వాతావరణ మార్పులతో తగ్గిన దిగుబడి

2021 నుంచి అపరాల పంటల దిగుబడులు దేశంలో తగ్గాయి. ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోకపోవడంతో దేశీయ పప్పు ధాన్యాల ఉత్పత్తి క్షీణించింది. 2021లో 27.30 మిలియన్ టన్నుల ఉత్పత్తి ఈ ఆర్థిక సంవత్సరంలో 23.44 మిలియన్ టన్నులకు తగ్గింది. వాతావరణ మార్పుల ఉత్పత్తిపై ప్రభావం చూపడంతో ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

మార్కెట్‌లో పప్పుల ధరలు

రకం	ధర (రూ.లలో)				
కందిపప్పు	175	శనగపప్పు	90	శెనగలు	80
మినపప్పు	120	పెసరపప్పు	115	జీడిపప్పు	750
		వేరుశనగగుళ్లు	120		

మరి కొన్ని రోజుల్లో ఈ ధరలు 20 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది.

దిగుమతులపైనే ఆధారం

కొన్ని పప్పులను ఆస్ట్రేలియా, కెనడా, రష్యా, టర్కీ, సూడాన్ వంటి దేశాల నుంచి దిగుమతులు చేసుకోవాలి. దిగుమతులు తగ్గించేలా దేశీయ పంటలను ప్రోత్సహించడానికి కేంద్రం దిగుమతి సుంకాలను విధించింది. అయినా వాతావరణ పరిస్థితులు దిగుబడుల్ని దెబ్బతీశాయి.

జీడిపప్పు మరింత ప్రియం

పప్పుల ధరలతో పాటు జీడిపప్పు ధర కూడా పెరిగింది. కిలో రూ.620 నుంచి రూ.750కు చేరింది. రాష్ట్రంలో, కేరళలో జీడిగింజల పంట దెబ్బతింది. టాంజానియా, దక్షిణాఫ్రికా దేశాల నుంచి కూడా జీడిగింజలు దిగుమతి చేసుకునే అవకాశం లేదు. దీంతో జీడిపప్పు ధరకు రెక్కలొచ్చాయి.

సరుకు లేకే ఈ ధరలు

మార్కెట్‌కు అపరాల సరఫరా తగ్గిడంతో పప్పుల ధరలు పెరుగుతున్నాయి. ఇతర దేశాల్లో వాతావరణ ప్రభావం దిగుమతులపై పడింది. కేంద్రం ప్రకటించిన ఎంఎస్‌పీ కంటే ఎక్కువకు పప్పులు కొనుగోలు చేస్తున్నాం. ధరలు మళ్లీ పెరిగే అవకాశాలున్నాయి.

– ఉంగరాల శ్రీనివాసు, అపరాల అసోసియేషన్ ప్రతినిధి

ఏం కొనేలా లేవు

కిలో కందిపప్పు రూ.175, కిలో శెనగపప్పు రూ.90. ధరలు ఇలా ఉంటే ఏం తింటాం, ఏం కొంటాం. పప్పులకు తోడు కూరగాయల ధరలు పెరిగిపోయాయి. ప్రభుత్వం జోక్యం చేసుకుని ధరలు తగ్గించడానికి కృషి చేయాలి. లేదంటే పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడతారు.

– కొండి లక్ష్మి, గృహిణి

తణుకులో ప్రైవేటు ఆసుపత్రులపై దాడులు



తణుకులోని జానకి ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో మహేశ్వరరావు

తణుకు: తణుకు పట్టణంలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. పట్టణంలోని ఆరోగ్య హాస్పటల్, జానకి హాస్పటళ్లలో దాడులు నిర్వహించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మహేశ్వరరావు రికార్డులు తనిఖీలు చేశారు. ఆరోగ్య హాస్పటల్‌కు సంబంధించి రికార్డులు సక్రమంగా లేవని చెప్పారు. రికార్డుల్లో సూచించిన వైద్యులు, క్షేత్రస్థాయిలో పని చేస్తున్న సిబ్బందికి పొంతన లేదన్నారు. కొత్త భవనంలోకి మార్చుతున్న సమాచారం ఇవ్వనందున ముందస్తు నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. జానకీ హాస్పటల్‌లో రికార్డులు తనిఖీ చేసిన డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ సాధారణ కాన్పులకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. రాష్ట్రంలోనే పశ్చిమగోదావరి జిల్లాలో అత్యధికంగా సిజేరియన్లు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎక్కువ శాతం సిజేరియన్లు చేస్తే ఆయా ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో తణుకు అర్బన్ నోడల్ అధికారి కె.రవికుమార్, బ్యాంకు కాలనీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.డానియల్, డిప్యూటీ డెమో అనంతలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

డీఈఎల్‌ఈడీ పరీక్షకు 67 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డీఈఎల్‌ఈడీ 4వ సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన పరీక్షకు 67 మంది విద్యార్థులు హాజరయ్యారని, హాజరు నూరు శాతంగా నమోదయిందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. పరీక్షల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులూ నమోదు కాలేదని తెలిపారు.

లిక్కర్ హంట్



ఏలూరు మినీబైపాస్ రోడ్డులోని పార్కులో యువత లిక్కర్ హంటింగ్

ఏలూరు టౌన్: సోషల్ మీడియాలో వీక్షకుల్ని పెంచుకునేందుకు యువత కొత్త పోకడలకు తెరదీస్తోంది. తమ వీడియో వైరల్ అయ్యేందుకు పబ్లిక్ ప్లేసులు, పార్కులు వంటి ప్రాంతాల్లో హడావుడి చేస్తున్నారు. తాజాగా ఏలూరు నగరంలో మనీ హంట్... లిక్కర్ హంట్ అంటూ కొందరు యువకులు ఒక గేమ్ స్టార్ట్ చేశారు. ఏలూరు నగరంలోని ఏదొక ప్రాంతంలో లిక్కర్‌ను దాచిపెట్టి ఆ వీడియోను వైరల్ చేస్తారు. ఈ వీడియో చూసిన యువత దాన్ని కనిపెట్టేందుకు పరుగులు పెడుతున్నారు. ఇదే తరహాలో మంగళవారం ఏలూరు మినీ బైపాస్‌లోని ఓ పార్కులో లిక్కర్ బాటిల్‌ను దాచిపెట్టి వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేశారు. దీంతో ఆ వీడియో చూసిన యువత ఆ లిక్కర్ బాటిల్‌ను కనిపెట్టేందుకు పరుగులు పెట్టారు. పార్కులో భారీ సంఖ్యలో యువత తిరుగుతుండటంతో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. తీరా ఆరా తీస్తే లిక్కర్ హంట్ భాగంగా వెతుకుతున్నామంటూ యువత సెలవిచ్చారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య


టి.జ్యోతి మృతదేహం

వీరవాసరం: మనస్థాపంతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై పి రమేష్ తెలిపిన వివరాల ప్రకారం పెరికిపాలెం గ్రామానికి చెందిన తత్తూరి జ్యోతి (38) ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక మనస్థాపానికిగురై సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇంట్లో ఉన్న ఎలుకల మందును సేవించింది. దీంతో అనారోగ్యానికి గురైన ఆమెను మంగళవారం మధ్యాహ్నం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించింది. ఈమెకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భర్త తత్తూరి పోతురాజు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ చెప్పారు.

జాతీయ వాటర్‌పోల్ పోటీలకు ఏలూరు క్రీడాకారులు

ఏలూరు రూలర్: జూలై 7వ తేదీ నుంచి మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జాతీయ జూనియర్ వాటర్‌పోల్ పోటీలు జరగనున్నాయని డీఎస్డీఓ బి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఏలూరుకు చెందిన పి రఘురామ్, ఎస్కే హకీల్, ఏ రిష్వంత్ ఎన్నికయ్యారని వెల్లడించారు. వీరు ముగ్గురు ఏలూరు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక భిశ్వనాథ్‌భర్తియా స్విమ్మింగ్ పూల్‌లో కోచ్ గణేష్ వద్ద శిక్షణ పొందుతున్నారని వివరించారు.

బాలుడి మృతదేహం లభ్యం


మణికంఠ మృతదేహం

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి గల్లంతైన తాడేపల్లిగూడెం మండలం పడాల గ్రామానికి చెందిన వానపల్లి మణికంఠ (14) మృతదేహం మూడురోజుల అనంతరం మంగళవారం లభ్యమైంది. వివరాల ప్రకారం మణికంఠ అనే పధ్నాలుగేళ్ల బాలుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 23న తండ్రి వానపల్లి సూరిబాబు సెలూన్ షాపులో క్షవరం చేయించుకుని ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో సైకిల్ పంక్చర్ కావడంతో మరమ్మతు చేయించుకుని వెళుతూ కాళ్లు కడుగుకునేందుకు యాగర్లపల్లి వద్ద కాలువరేవులోకి దిగాడు. అయితే హఠాత్తుగా కాలుజారి కాలువలో పడి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంయుక్తంగా మణికంఠ కోసం బోటులో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే రెండు రోజుల తర్వాత కూడా బాలుడి జాడ కనిపించకపోవడంతో మంగళవారం కాకినాడ నుంచి ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని ప్రత్యేకంగా రప్పించి వెదికించారు. దీంతో యాగర్లపల్లి రేవు సమీపంలో బాలుడి మృతదేహం లభ్యం కావడంతో పోలీసు వారికి అప్పగించినట్లు అగ్నిమాపక అధికారి గణేశ్న వెంకట రామారావు తెలిపారు. మణికంఠ మృతదేహానికి తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అతని బంధువులకు అప్పగించినట్లు పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం వెల్లడించారు.

బడి సంచి భారం..!



- అమలుకాని ఎన్‌సీఈఆర్‌టీ సూచనలు
- విద్యార్థులకు తప్పని పుస్తకాల భారం

వీరవాసరం: పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు పుస్తకాల సంచి భారంగా మారుతోంది. దీంతో చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నారన్నది వైద్యుల మాట. ఈ పరిస్థితిని నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) చేసిన సూచనలు ఎక్కడా అమలు కావడం లేదు. ఏటా పుస్తకాల సంచిలో బరువు పెరగడమే తప్ప.. తగ్గడం కనిపించడం లేదు. విద్యార్థి తన శరీర బరువులో రెండో వంతు మోయడం అనారోగ్య సమస్యలను తెచ్చి పెడుతోంది. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో పుస్తకాల సంచి పరిమాణాన్ని తగ్గిస్తూ రాష్ట్రాలకు కేంద్రం సూచనలు చేసింది.

ఇదీ ఎన్‌సీఆర్‌ఈటీ పరిశీలన

బడి సంచి బరువుపై జాతీయ విద్యాపరిశోధన శిక్షణ మండలి(ఎన్‌సీఆర్‌ఈటీ) నిర్వహించిన సర్వేలో నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను పరిశీలించారు. సాధారణంగా వీరి శరీర బరువు 18 కేజీల నుంచి 22 కేజీల వరకు ఉంటుంది. ప్రభుత్వ బడుల్లో 10 నుంచి 12 కేజీలు, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 14 నుంచి 18 కేజీల పుస్తకాల మోత ఉంటుంది. 8 నుంచి పదో తరగతి విద్యార్థుల శరీర బరువు 40 నుంచి 50 కేజీల వరకు ఉంటే వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా భావించాలి. వారు బడికి వెళ్లేందుకు 20 నుంచి 25 కేజీల సంచిని మోయాల్సి వస్తోంది. పాఠ్యపుస్తకాలకు తోడు క్యారేజీ, తాగునీటి బ్యాటిల్స్ తదితరాలు అదనం. ప్రభుత్వ బడుల కన్నా ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల మోత ఎక్కువగా ఉంటుందని శిక్షణ మండలి పేర్కొంది. రాష్ట్ర సిలబస్‌తో పాటు పాఠశాలలు ప్రత్యేకంగా రూపొందించిన సిలబస్, ఐఐటీ, సీబీఎస్‌ఈ ఇలా వివిధ రకాల పుస్తకాలను మోయాల్సి రావడం విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది.

తగ్గని బరువు...

వాస్తవానికి ఒకటి, రెండు తరగతులకు రెండు పుస్తకాలు (లాంగ్వేజెస్, గణితం) మూడు నుంచి ఐదో తరగతి విద్యార్థులకు కేవలం మూడు పుస్తకాలు (లాంగ్వేజెస్, గణితం, ఎన్విరాన్మెంట్) ఉండాలి. సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) పిల్లలపై ఒత్తిడి తగ్గించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తోంది. అయితే ప్రస్తుతం ఒకటి, రెండు తరగతులకు ఎనిమిది పుస్తకాలు, తరగతి పెరిగే కొద్ది అధిక పాఠ్యపుస్తకాలు, నోట్స్ బుక్స్ మోయాల్సి వస్తోంది. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల పరిస్థితి చెప్పనక్కర్లేదు.

ఆరోగ్య సమస్యలివే..

విద్యార్థులు తమ స్థాయికి మించి బరువు మోస్తుండడంతో పలురకాల ఆరోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వెన్ను, కండరాల నొప్పులకు దారి తీస్తుందని పేర్కొంటున్నారు. శారీరక, మానసిక సమస్యలు ఏర్పడవచ్చంటున్నారు. చదువులపై ఏకాగ్రత తగ్గుతుందని హెచ్చరిస్తున్నారు. సృజనాత్మకత దెబ్బతినడమే కాకుండా తద్వారా విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతారని పేర్కొంటున్నారు.

జీవో ప్రకారం తరగతుల వారీగా బడి సంచి బరువు ఇలా..

విద్యార్థుల బరువుపై రాష్ట్ర ప్రభుత్వం 2017లో జీవో నం.22 విడుదల చేసింది. దాని ప్రకారం తరగుతల వారీగా విద్యార్థులు మోసే బడి సంచి బరువు ఇలా ఉండాలి.

తరగతి	బరువు (కిలోలు)
1–2	1.5
3–5	2 – 3
6–7	4
8–9	4 – 5
10	5

ఆరోగ్యంపై దుష్ప్రభావం

విద్యార్థులు తమ సామర్థ్యానికి మించి పుస్తకాల సంచిని మోయడం మంచిది కాదు. మానసికంగా బలహీనత, నడుము, వెన్నుపూస కండరాల నొప్పులు బాధిస్తాయి. తద్వారా పిల్లలు చదువుపై దృష్టిపెట్టలేరు. పుస్తకాల సంచి బరువును తగ్గించే ప్రయత్నాలు కచ్చితంగా చేయాలి. అప్పుడే ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటారు. చక్కటి విద్యాభ్యాసం చేస్తారు.

– డాక్టర్ షేక్ సత్తార్ సాహెబ్, వైద్యులు, రాయకుదురు

స్కూల్ బ్యాగ్ చాలా బరువుగా ఉంటుంది

నేను ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాను. స్కూల్ బ్యాగ్ చాలా బరువుగా ఉంటుంది. ఇంటి నుంచి బస్సు వరకు, బస్సు దిగాక స్కూల్ వరకు పుస్తకాల బ్యాగును ప్రతిరోజు మోసుకుని వెళ్లాల్సిందే. అన్ని సబ్జెక్టుల పుస్తకాలు పట్టుకెళ్లాల్సి ఉంటుంది. కాబట్టి బరువు అయినా తప్పదు. ఒక్కొక్కసారి స్కూల్లోనే కొన్ని బుక్స్ వదిలేస్తూ ఉంటాము. పుస్తకాల బరువు తగ్గిస్తేనే మంచిది.

– కె.రేవంత్, 7వ తరగతి విద్యార్థి


ఫిట్స్‌తో విద్యార్థిని మృతి

పోడూరు గ్రామంలో విషాదఛాయలు


చెల్లబోయిన అనుషా గోపిక నందిని(ఫైల్)

పోడూరు: పోడూరు గ్రామంలో ఓ విద్యార్థిని ఫిట్స్‌తో సోమవారం మృతిచెందింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బంధువులు, ఉపాధ్యాయులు తెలిపిన వివరాల మేరకు స్థానిక కల్నల్ డీఎస్‌రాజు జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న చెల్లబోయిన అనుషాగోపిక నందిని(14) రోజూ మాదిరిగానే ఉదయం హైస్కూల్‌కు వెళ్లింది. ఆమె మూగ, చెవిటి వైకల్యం ఉండడంతో పాటు చిన్నప్పటి నుంచి ఫిట్స్ వస్తుంటాయి. మధ్యాహ్నం హైస్కూల్‌లో భోజనం చేశాక విరామం అనంతరం తరగతులకు వెళుతుండగా ఫిట్స్ వచ్చి వెనక్కు పడిపోయింది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆమెకు తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు సపర్యలు చేసినా కోలుకోకపోవడంతో బాలిక తాతయ్య కండిబోయిన భాస్కరరావుకు సమాచారమిచ్చారు. అనంతరం వెంటనే వైద్యం నిమిత్తం స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం 108 వాహనంలో పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు తెలిపారు. వీరి స్వగ్రామం వేడంగి. నందిని తండ్రి చెల్లబోయిన శ్రీనివాసరావు 3 ఏళ్ల కిందట అనారోగ్యంతో మృతిచెందడంతో ఆమె తల్లి లక్ష్మి ఇద్దరు కుమార్తెలను తీసుకుని పోడూరులోని పుట్టింటికి వచ్చేసింది. ఇటీవలే ఆమె ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లింది. నందిని అక్క కుసుమ పావని తనూజ ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. వైకల్యం ఉన్నా ఎంతో చురుగ్గా ఉండే నందిని మృతిచెందడంతో బంధువులు, తోటివిద్యార్థులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనతో పోడూరు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

మేఘం.. వర్ణశోభితం



మంగళవారం సంధ్యా సమయంలో ఆకాశంలో మబ్బులు రకరకాల కాంతులతో దర్శనమిచ్చాయి. సింధూర, పసిడి కాంతులతో వర్ణశోభితంగా ఆవిష్కృతమయ్యాయి. పోలవరంలో చోటుచేసుకున్న ఈ అద్భుతాలను చూస్తూ ప్రజలు ముగ్ధులయ్యారు.

– పోలవరం రూరల్


పోలవరంలో వర్ణశోభితంగా కనిపిస్తున్న ఆకాశం

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడి అరెస్ట్


కేసుకు సంబంధించి వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ముదినేపల్లి రూరల్: బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని స్థానిక పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఏలూరు డీఎస్పీ ఈ శ్రీనివాసులు, ఎస్సై డి వెంకటకుమార్ ఇందుకు సంబంధించిన వివరాలు మంగళవారం వెల్లడించారు. మండలంలోని దేవపూడికి చెందిన ఒక మహిళ తన భర్త చనిపోవడంతో హైదరాబాద్‌కు చెందిన ఎం ఉదయ్‌కుమార్‌తో సహజీవనం చేస్తోంది. అతను తరచూ హైదరాబాద్ నుంచి దేవపూడి వచ్చి వెళుతుంటాడు. ఈ మహిళకు పదేళ్ల కుమార్తె, ఏడేళ్ల కుమారుడు ఉన్నారు. గత నెల 19న దేవపూడి వచ్చిన ఉదయ్‌కుమార్ అర్ధరాత్రి ఆ మహిళ కుమార్తెపై అత్యాచారానికి ఒడిగట్టాడు. బాలిక కేకలు వేయడంతో నిద్రలేచిన ఆమె తల్లి అడ్డుకుంది. అయితే ఈ విషయం ఎవరికైనా చెబితే తనకు గతంలో ఇచ్చిన రూ.2.20 లక్షలు ఇవ్వనని, చంపేస్తానని నిందితుడు ఉదయ్‌కుమార్ ఆ మహిళను బెదిరించాడు. దీనితో ఆమె ఈ విషయాన్ని గ్రామానికి చెందిన నలుగురు పెద్దలకు తెలియజేయడంతో రాజీ చేసుకోవాల్సిందిగా వారు సూచించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 16న పెద్దమనుషులు బాధిత మహిళ వద్దకు వచ్చి ఉదయ్‌కుమార్ ఇవ్వాల్సిన డబ్బులు మొత్తం ఇచ్చేస్తాడని, పోలీసు కేసు పెట్టనని తెల్లకాగితంపై సంతకం చేయాలని కోరారు. దీనికి నిరాకరించిన ఆమె గురువారం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఏలూరు మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ ఎస్ మురళీకృష్ణ గ్రామంలో విచారించి వివరాలు సేకరించారు. అనంతరం నిందితుడు ఉదయ్‌కుమార్‌ను మంగళవారం అరెస్టు చేసి, వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కైకలూరు కోర్టులో హాజరుపర్చినట్లు డీఎస్పీ, ఎస్సై తెలిపారు.

జూలై 1 నుంచి నూతన చట్టాల అమలు


ఏఎస్పీ జి.స్వరూపరాణి

జంగారెడ్డిగూడెం: జూలై 1 నుంచి కొత్త న్యాయచట్టాలు అమలులోకి వస్తున్నాయని ఏఎస్పీ జి.స్వరూపరాణి తెలిపారు. జంగారెడ్డిగూడెం పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని, జంగారెడ్డిగూడెం సర్కిల్ కార్యాలయాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు అమలులో ఉన్న ఐపీసీ, సీఆర్‌పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ వంటి చట్టాలను మార్చుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. జూలై 1 నుంచి వాటి స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎస్‌ఎస్), భారతీయ సాక్ష్యా అధినియం చట్టం (బీఎస్‌ఏ) అమలులోకి రానున్నాయన్నారు. వీటికి సంబంధించి సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. డివిజన్ పరిధిలో 90 శాతం సిబ్బంది శిక్షణ పొందారని, మిగిలిన 10 శాతం సిబ్బంది సైతం ఒకటి రెండు రోజుల్లో శిక్షణ పూర్తి చేయనున్నట్లు చెప్పారు. కాగా బంగారం, వాహనాలు తదితర చోరీలకు సంబంధించి రికవరీలు పెరుగుతున్నాయని ఆమె తెలిపారు. డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐ పి.రాజేష్, ఎస్సై జి.జ్యోతిబాస్ పాల్గొన్నారు.

ఉరి వేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి


నరసాపురం రూరల్: నరసాపురం మండలంలోని లక్ష్మణేశ్వరంలోని డంపింగ్ యార్డులో ఉరి వేసుకుని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మంగళవారం తెల్లవారుజామున స్థానికులు గుర్తించి వీఆర్వో మేశం చిరంజీవి సతీష్‌కి ఈ విషయాన్ని తెలియజేశారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నరసాపురం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుని వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటాయని, ఒంటిపై నీలం రంగు జీన్స్ ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు, మృతదేహం సమీపంలో కనకాంబరం రంగు చొక్కాను గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. మృతుని సంబధీకులు నరసాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

వానాకాలం వ్యాధులతో పశువులు జాగ్రత్త

- ప్రాణాంతక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పశువైద్యాధికారులు


ఆవుకు వ్యాధి నిరోధక టీకాను వేస్తున్న దృశ్యం


పశువుల కొట్టాంలోని పాడి గేదెలు



ఏలూరు (టూటౌన్): వర్షాకాలంలో వివిధ ప్రాణాంతక వ్యాధులు పశువులకు సోకే ప్రమాదముంది. దీనివల్ల పశువులు నీరశించిపోవడం లేదా చనిపోవడం జరుగుతుంది. దీంతో రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని పశువైద్యులు చెబుతున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణాంతక వ్యాధుల నుంచి పశువులను కాపాడుకోవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. పశువుల్లో ముఖ్యంగా గొంతువాపు, జబ్బవాపు, పొదుగువాపు, జీవాల్లో చిటుక వ్యాధి, నీలినాలిక వ్యాధి వంటివి వర్షాకాలంలో ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు.

గొంతు వాపు వ్యాధి

వర్షాకాలంలో గేదెలకు సోకే ప్రాణాంతక వ్యాధులలో గొంతువాపు ఒకటి. ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే వ్యాధి సోకిన 8 నుంచి 24 గంటల వ్యవధిలో పశువు చనిపోతుంది. అధిక జ్వరం, నోటినుంచి సొంగ కారడం, ముక్కునుంచి చిక్కటి ద్రవం స్రవించడం, గొంతు భాగంలో వాపు తరువాత వాపు క్రమంగా దవడలు, పొట్ట భాగానికి విస్తరిస్తుంది. వ్యాధి తీవ్రమైన దశలో తీవ్రమైన గురక, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, పొట్ట ఉబ్బరం వంటి లక్షణాలతో పశువు చనిపోవడం జరుగుతుంది. దీని నివారణ కొరకు వ్యాధి సోకిన పశువులను ఇతర పశువుల నుంచి దూరం పెట్టాలి. ముందుస్తుగా మే నెలలో 4 నెలలు దాటిన పశువుకు వ్యాధినిరోధక టీకాలు వేయించాలి.

జబ్బవాపు వ్యాధి

ఈ వ్యాధి 6 నుంచి రెండేళ్ల వయస్సు గల ఆవుల్లో ఎక్కువగా వస్తుంది. ఈ వ్యాధి క్లాస్ట్రీడియం చావై అనే బ్యాక్టీరియా వలన కలుగుతుంది. వ్యాధి సోకిన పశువులకు తీవ్రమైన జ్వరం, వెనుక కాళ్లలో భుజము, తొడలలో వాపు వచ్చి పశువులు నడవలేక కుంటుతాయి. వాపును చేతితో తాకితే వేడిగా ఉండి కరకరమని శబ్దం వస్తుంది. దీని నివారణ కొరకు ముందుగా వ్యాధిగ్రస్త పశువులను వేరుచేయాలి. వ్యాధిరాకుండా వర్షాకాలం ముందే ప్రభుత్వం నాలుగు నెలలు దాటిన అన్నిపుజాతి పశువులకు అందించే జబ్బవాపు వ్యాధి టీకాలు వేయించాలి.

ఏలూరు జిల్లాలో టీకాలు వేసిన పశువుల సంఖ్య	
చిటుక వ్యాధి టీకాలు వేసినవి	4,58,500
జబ్బవ్యాధి టీకాలు వేసినవి	36,000
గొంతు వాపు వ్యాధి టీకాలు	1,41,000

గొర్రెల్లో చిటుక వ్యాధి

ఈ చిటుక రోగం క్లాస్ట్రీడీయం వెల్చి అనే బ్యాక్టీరియా ద్వారా తొలకరి వానల తరువాత పెరిగే గడ్డిని తినడంతో జీవాలకు ఈ వ్యాధి వస్తుంది. వ్యాధి తీవ్రంగా ఉంటే మందలో బలిష్టంగా ఉన్న గొర్రెలు, మేకలు ఎటువంటి లక్షణాలు చూపించకుండా అకస్మాత్తుగా మరణిస్తాయి. జీవాలు చనిపోయే ముందు నీరసంగా ఉండడం, కాళ్లు బిగుసుకుపోవడం, కాళ్లతో పొట్టను తన్నుకోవడం, పళ్లు కొరుకుతూ గాలిలో చెంగున ఎగిరి క్రిందపడి చనిపోతాయి. ఈ వ్యాధి ఎక్కువ మొత్తంలో పాలు తాగిన గొర్రెపిల్లలో కనిపిస్తుంది. ఏప్రిల్, మే నెలలో మందలోని అన్ని జీవాలకు చిటిక వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. గొర్రె పిల్లలు ఎక్కువ మొత్తంలో పాలు తాగకుండా చూడాలి. తొలకరిలో జీవాలు కడుపునిండా మేత మేయకుండా చూడాలి.

నీలి నాలుక వ్యాధి

దీనినే మూతి వాపు లేదా బ్లూటంగ్ అనే పేర్లతో పిలుస్తారు. ఈ వ్యాధి దోమలు ఉధృతంగా ఉండే జూలై, ఆగస్టు నెలల్లో గొర్రెల్లో ఎక్కువగా కనిపిస్తుంది. వ్యాధి సోకిన జీవాల్లో తీవ్రమైన జ్వరం, మూతి, పెదవులు, నాలుక, ముఖము వాచి ఎర్రబడుతుంది. ముక్కులు వాచి స్రవాలు కారుతాయి. కాళ్ల గిట్టల దగ్గర ఎర్రగా వాచి కుంటుతాయి. జీవాల్లో 10 శాతం మరణాలు సంభవిస్తాయి. దోమలను నివారించడానికి వేప పొగ పెట్టాలి. వర్షాకాలానికి ముందు వ్యాధి రాకుండా నివారణా టీకాలు వేయించాలి.

వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వర్షాకాలం ఆరంభమయ్యే ముందే పశువులకు, జీవాలకు టీకాలు వేయించాలి.
- పశువుల పాకల్లో నీరు నిలువ ఉండకుండా పొడిగా ఉండేలా చూడాలి. పొడిసున్నము, బ్లీచింగ్ పౌడర్ చల్లాలి.
- ఈదురుగాలులు తగలకుండా పశువుల పాకల చుట్టూ పరదాలు కట్టాలి.
- ఎండుగడ్డి, దాణా తడవకుండా చూడాలి.
- పరిశుభ్రమైన తాగునీరు, మేత ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలి.
- చనిపోయిన పశువుల కళేబరాలను ఊరికి దూరంగా ఆరడుగుల గోతిలో సున్నం వేసి పూడ్చాలి.
- వ్యాధి సోకిన పశువులను ఆరోగ్యంగా ఉన్న పశువులతో కలుపకుండా వేరుగా ఉంచాలి.
- పొదుగు వాపు వ్యాధి రాకుండా పాలు పితికే ముందు పరిశుభ్రమైన గోరువెచ్చని నీటితో పొదుగును కడగాలి.
- ఈగలు, దోమలు పశువులను కుట్టకుండా దోమతెరలు కట్టడం, పశువుల పాకలో వేప పొగ వేయడం చేయాలి.
- పశువులు, జీవాలకు తప్పనిసరిగా పేడ పరీక్ష చేయించి తగిన నట్టల మందు తాగించాలి.
- ఎక్కువ పశువులు ఒకేచోట గుంపులుగా ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

పశువుల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి



వర్షాకాలంలో పశువులకు వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున్న పశు పోషకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. పశువులను జాగ్రత్తగా గమనిస్తూ ఏదైనా తేడా కనిపిస్తే సమీపంలోని పశువైద్యులను సంప్రదించాలి. జిల్లాలోని పశువులు, జీవాల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన వ్యాధి నిరోధక టీకాలు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ జి.నెహ్రూబాబు, జేడీ, పశుసంవర్ధకశాఖ, ఏలూరు

ఐదేళ్లు నో పవర్ కట్



తణుకులో విద్యుత్ శాఖ కార్యాలయం

- విద్యుత్ శాఖలో నూతన సంస్కరణలు
- నిర్వహణలో గత ప్రభుత్వానికి ప్రజల కితాబు
- నియోజకవర్గంలో 2 విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటు
- సరఫరాలో హెచ్చు తగ్గులకు చెక్

తణుకు అర్బన్: విద్యుత్ శాఖలో ఆవిష్కరింపబడిన ప్రభుత్వ విధి విధానాలకు అనుగుణంగా ఆ శాఖ అందించిన సేవలు అజరామజరంగా నిలిచాయి. ఐదేళ్లపాటు విద్యుత్ శాఖకు సంబంధించి వేసవిలో పవర్ కట్ అనే మాటే లేకుండా విద్యుత్ సరఫరా చేయడమే కాకుండా సరఫరాలో హెచ్చు తగ్గులకు తావులేకుండాచేసింది. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా విద్యుత్ శాఖ నిరంతరం నాణ్యమైన విద్యుత్‌సేవలు అందించేవిధంగా ప్రణాళికాబద్ధంగా నడిచి ప్రజల మన్ననలు పొందింది. ముఖ్యంగా లోవోల్టేజ్ సమస్యతోపా టు విద్యుత్ షార్క్ సర్క్యూట్ కారణంగా ఏర్పడే ప్రమాదాల నివారణకు అత్యంతప్రాధాన్యతనిచ్చా రు. గత ప్రభుత్వ ఆదేశానుసారం విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు సైతం తీవ్రంగా శ్రమించి ఆ శాఖ పని తీరును గతం కంటే మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేశారు.

నో పవర్ కట్

గతంలో వేసవి వస్తుందంటే చాలు పవర్ కట్ చేస్తారనే భయం ప్రజల్లో ఉండేది. కానీ గత ఐదేళ్లలో ఏ వేసవిలో కూడా రాష్ట్ర వ్యాప్తంగా తీసుకున్న చర్యల్లో భాగంగా తణుకు నియోజకర్గంలో కూడా పవర్ కట్ ప్రస్తావనే లేకుండా పోయింది. ప్రతి ఏడాదికి వేసవి ఎండలు పెరగడం తద్వారా విద్యుత్ వాడకం పెరిగినప్పటికీ, విద్యుత్ ఉత్పత్తి ఆశాజనకంగా లేకపోయినా అవసరానికి తగినట్లుగా విద్యుత్‌ను కొనుగోలు చేసి గత ప్రభుత్వం వేసవి పవర్ కట్‌ను జయించింది. వార్షిక మరమ్మత్తులు, విద్యుత్ తీగలను తాకుతున్న చెట్ల కొమ్మలు తొలగింపులో భాగంగా మాత్రమే శుక్రవారం కొంతసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగేది. కానీ ఎటువంటి పవర్ కట్ లేకుండా విద్యుత్ సరఫరా చేశారని ప్రజలు సైతం ప్రశంసించారు.

నియోజకవర్గంలో విద్యుత్ శాఖకు రూ.250.48 కోట్లు

తణుకు అర్బన్: తణుకు నియోజకవర్గంలోని మున్సిపాలిటీ, తణు కు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో విద్యుత్ సరఫరాతోపాటు పరికరాల కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకొని వివిధ కేటగిరీల్లో విద్యుత్ సబ్సిడీలకు సైతం పెద్దపీట వేశారు. ఐదేళ్లలో అభివృద్ధి, సంక్షేమానికి రూ.250.48 కోట్లు నిధులు ఖర్చు చేశారు. విద్యుత్‌శాఖ అభివృద్ధి పనులకు రూ.125.69 కోట్లు, సంక్షేమానికి రూ.124.48 కోట్లు వెచ్చించారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో రెండు విద్యుత్ సబ్ స్టేషన్‌లు, విద్యుత్ లైన్స్, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్స్, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్స్‌కు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు.

క్లుప్తంగా

ఉచిత గుండె వైద్య శిబిరం



మంచిలి వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అత్తిలి: పేదల ఆరోగ్య సంరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని టీడీపీ మండలాధ్యక్షుడు ఆనాల ఆదినారాయణరావు అన్నారు. విజయవాడ ఉషా కార్డియాక్ ఆసుపత్రి వారిచే మంచిలి గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతారామయ్య, ఉప సర్పంచ్ ఏరుబండి అయ్యప్ప, శీతాల శ్రీనివాసరావు, భగవాన్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత



విద్యార్థులకు విద్యాసామగ్రి అందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక సంజీవనగర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న విద్యా కానుక ఉచిత బ్యాగ్‌లు, పుస్తకాలు, కిట్‌లు అందజేశారు. నలగంచు రాంబాబు, శ్రీరంగం అంజిబాబు, దాట్ల జగన్నాధరాజు, ఓల్డ్ స్టూడెంట్స్, పాతూరు యూత్ సభ్యులు, హెచ్‌ఎం బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక సవిత్ళపేట 15వ వార్డులో ఎలిమెంటరీ స్కూల్‌లో హెచ్‌ఎం ఎండీ అమిరుద్దీన్ ఆధ్వర్యంలో విద్యా కానుక కిట్లు అందజేశారు. బొలిశెట్టి రాజేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతుల పరిశీలన



రోడ్ల మరమ్మతులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం: పట్టణంలోని కేఎన్‌రోడ్డు, ఏలూరు, తణుకు రోడ్డు మార్గాల్లో రహదారుల్లో రోడ్ల మరమ్మతులను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు మంగళవారం పరిశీలించారు. ప్రజల అసౌకర్యాన్ని తొలగించేందుకు వెంటనే ఈ పనులు చేయించాలని మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించడంతో పనులు చేట్టారు. సుమారు పది లక్షల రూపాయల వ్యయంతో ఈ పనులను ప్రారంభించామన్నారు. పార్టీ నాయకులు వర్తనపల్లి కాశీ, గురుజు సూరిబాబు. పాలూరి వెంకటేశ్వరరావు, పైబోయిన చిన వెంకట్రామయ్య, కాళ్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లపై దృష్టి సారించాలి



ఎస్ఎన్‌వీటీ ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపల్, అధ్యాపకులతో సమావేశమైన డీఐఈవో

తణుకు: ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లపై దృష్టి సారించాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి (డీఐఈవో) ఎ.నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం తణుకులోని ఎస్ఎన్‌వీటీ, ఎస్‌సీ ఐఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేసి అనంతరం ప్రిన్సిపల్స్, అధ్యాపకులతో సమావేశమయ్యారు. డిజిటల్ తరగతుల తీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. సమావేశంలో ప్రిన్సిపాల్స్ వి.శ్రీనివాస్, ప్రభాకర్, అధ్యాపకులు రాజ్‌కృష్ణ, వాయునందరావు, డి.సత్యనారాయణ గౌస్, యూడీసీ రాహుల్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ పద్మజ్యోతి

ఇరగవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు ప్రతీ 15 రోజులకోసారి శుభ్రం చేయాలని ఎంపీడీఓ కె.పద్మజ్యోతి తెలిపారు. మంగళవారం ఇరగవరం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో చెత్తకుప్పలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, దోమల నివారణకు మలాథియాన్ మందును స్ప్రే చేయించాలని ఆదేశించారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో ఫ్రైడే డ్రైడే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు రైతు ఖాతాల్లో జమ చేయాలి



ఆకుతీగపాడులో ధాన్యం సొమ్ముల కోసం ఆందోళన చేస్తున్న వ్యవసాయకార్మికసంఘం, రైతులు

పెంటపాడు: దేశానికి అన్నంపెట్టే రైతన్నలు సుభిక్షంగా ఉండేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలని వ్యవసాయ కార్మికసంఘ జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో ఆకుతీగపాడు గ్రామంలో కౌలురైతులు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆకుతీగపాడు గ్రామంలో రైతు భరోసా పరధిలో సుమారు 210 మంది నుండి ధాన్యం కొనుగోలు చేయగా నామమాత్రంగా సొమ్ములు ఇచ్చారన్నారు. పూర్తిస్థాయిలో సొమ్ములు సకాలంలో ఇప్పించాలని ఈ సందర్భంగా కళింగ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వంకా రామకృష్ణ, జమ్మిశెట్టి శ్రీనివాస్, ఆలమండ అజయ్, దేపల్లి సుబ్బారావు, కొణతాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జంతువుల పరిరక్షణపై వ్యాసరచన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

భీమవరం: జంతువుల సంరక్షణ, పరిరక్షణ మానవత్వంతో కూడిన సామాజిక బాధ్యత అని జిల్లా పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాఫర్ హుస్సేన్, ఏడీ సత్యనారాయణ అన్నారు. జిల్లా జంతు సంక్షేమం, పశు సంవర్ధక శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జంతు సంరక్షణ, పరిరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా భీమవరం సీవీ రామన్ స్కూల్, పీఎస్‌ఎం హైస్కూల్లో విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రెండు పాఠశాలల్లో 52 మంది విద్యార్థులకు పోటీలను నిర్వహించామని, గెలుపొందిన వారికి జూలై 6న జరిగే ముగింపులో బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సరిత, ఎం.సుధారాణి, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, పార్వతి, చిన్మయ తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన సదస్సు



గొల్లవానితిప్ప పీహెచ్‌సీలో డయేరియాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: డయేరియాపై ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యాధికారిని అరుణకుమారి సూచించారు. మండలంలోని గొల్లవానితిప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బందికి డయేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి అరుణకుమారి మాట్లాడుతూ డయేరియా కలుషితమైన ఆహారం, నీళ్లు తీసుకోవడం వలన వస్తుందన్నారు. ఈ వ్యాధి సోకితే అధిక నీళ్ల విరేచనాలతో మనిషి నీరసించిపోతాడన్నారు. వేసవి ముగిసి వర్షాకాలం ప్రారంభమవుతుండటంతో గ్రామాలలో రక్షిత మంచినీటి చెరువులకు కొత్త నీరు పెడతారని వైరల్ జ్వరాలు వస్తాయని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతేకాకుండా ఇంటింటికి తిరిగి 5 సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించి ఓఆర్‌ఎస్, జింక్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. పంచాయతీ సిబ్బందితో కలిసి త్రాగునీటి సరఫరాలో క్లోరినేషన్, శానిటేషన్ వంటి పనుల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్‌పీహెచ్‌ఈవో కె.అప్పారావు, సూపర్‌వైజర్ జి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



విద్యార్థులతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఉండి: ప్రతీ ఒక్కరూ కష్టపడి చదివితే చదువులో రాణిస్తారని లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మీ, కన్నెగంటి రూత్‌కళ అన్నారు. మంగళవారం ఉండి మండలం చిలుకూరు, మహదేవపట్నం ప్రాథమిక పాఠశాల్లో దాత సాగిరాజు సాంబశివరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు కంచాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువు పట్ల శ్రద్ధ కలిగి ఉంటే ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. అందివచ్చే ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధతో వారు చదివే విధానం, చదవుపై వారికున్న మక్కువను ఎప్పటికప్పుడు గమనిస్తూ వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రుద్రరాజు నరసరాజు, ఉపాధ్యక్షుడు గాదిరాజు రంగరాజు, సత్తి బ్రహ్మారెడ్డి, గాదిరాజు వెంకటేశ్వరరాజు, పి.నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను అల్లరి చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి



ఏనుగువానిలంక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులతో పోలీసులు

పాలకొల్లు అర్బన్: ఆడపిల్లలను ఎవరైనా అల్లరి చేస్తే అప్రమత్తంగా ఉండాలని పాలకొల్లు రూరల్ సీఐ కుడిపూడి సతీష్ అన్నారు. యలమంచిలి మండలం ఏనుగువానిలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పోలీస్ చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు ఏదైనా ప్రమాదం గానీ, ఎవరినుంచైనా ఇబ్బందులు ఎదురైతే వారిలో వారే కుంగిపోకుండా తల్లిదండ్రులకు, మహిళా పోలీసులకు లేదా 100కి ఫోన్ చేయాలని సీఐ సతీష్ సూచించారు. మగ పిల్లలు ప్రేమిస్తున్నానని, లేదా రకరకాల ప్రలోభాలకు గురిచేస్తుంటారని, వారిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. చదువుపై ధ్యాస పెట్టి బాగా చదువుకుని మంచి ఉన్నత స్థితికి చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కె శివన్నారాయణ, పాఠశాల హెచ్‌ఎం ఎస్ఎస్ అవధాని, సహోపాధ్యాయుడు సీహెచ్ రంగప్రసాద్, ఏఎస్సై ఎస్ దుర్గారావు పాల్గొన్నారు.

నేడు అలంపురంలో ఉచిత వైద్యసేవలు

పెంటపాడు: మండలంలోని అలంపురం వెంకటరమణ సేవా ఛారిటీ ఆసుపత్రిలో బుధవారం ఉదయం 10 గంటలకు పలువురు ప్రముఖ వైద్యులతో ఆరోగ్యసేవలు ఉచితంగా అందించనున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి రాజానగరానికి చెందిన జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యులు జనరల్ మెడిసన్, అంకాలజీ, గైనకాలజీ, కార్డియాలజీ, చిన్నపిల్లలు వైద్యనిపుణులు పరీక్షలు చేస్తారని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటల నుండి ప్రారంభిచబోయే ఈ శిబిరాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్యసేవలతో పాటు, గుండె వ్యాధికి సంబంధించి ఈసీజీ, 2డీ ఎకో, అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు కూడా ఉచితంగా చేస్తారన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

తణుకు: ఇంటర్మీడియేట్ రెండో సంవత్సరం చదువుతున్న బాలిక కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తణుకు రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని తేతలికి చెందిన బాలిక (17) తణుకులోని ఎస్ఎన్‌వీటీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం కళాశాలకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పిన ఆమె కళాశాలకు వెళ్లకపోగా సాయంత్రం తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు తణుకు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న 10వ అదనపు జిల్లా జడ్జి విజయదుర్గ

నరసాపురం: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఈ నెల 29న నిర్వహిస్తున్నామని, ఈ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా సహకరించాలని నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ న్యాయవాదులను కోరారు. జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై మంగళవారం ఆమె బార్ అసోసియేషన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి విజయదుర్గ మాట్లాడుతూ సివిల్ కేసులు రాజీ చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించాలని చెప్పారు. మధ్యవర్తిత్వం వహించి వారిలో అవగాహన పెంచాలని చెప్పారు. క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు రాజీ చేసుకోదగిన అన్ని కేసులు పరిష్కారం కావడానికి సహకరించాలని చెప్పారు. ఈ సమావేశంలో జడ్జిలు జి.గంగరాజు, కె.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు, కార్యదర్శి ఆర్‌జీ కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీగణపతి హోమం



లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. మంగళవారం ఆలయ అభిషేక పండిట్ భమిడిపాటి వెంకన్న బ్రహ్మత్వంలో ప్రారంభించిన లక్ష్మీగణపతి హోమంలో 26 మంది దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు స్వామి వారి శేషవస్త్రం, జాకెటు ముక్కలు, ప్రసాదం అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలి



నందమూరులో మాట్లాడుతున్న కండెల్లి సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకం కూలీలకు రావాల్సిన కూలి సొమ్ములను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని నందమూరు గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ ఉపాధి కూలి సొమ్ములు రాక కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే బకాయిలు విడుదల చేయాలన్నారు. రైతు సంఘం జిల్లా నాయకుడు చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో కూలీలు ఎక్కువ మంది ఉన్నారని, ఆయకట్టు పేరుతో తక్కువ పనిదినాలు చూపిస్తున్నారని విమర్శించారు. ఉపాధి హామీ పథకం పనులు సమగ్రంగా చూపించాలన్నారు. దొడ్ల అమ్మాజీ, చిన్నం జలదాక్షి, కనకమహాలక్ష్మి, ఆనంద్, కట్టా దేవి, మునుకోటి అన్నవరం, అడపా కుమారి, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



తల్లులకు ఆరోగ్య సూచనలు చేస్తున్న సీడీపీఓ టీఎల్ సరస్వతి

తాడేపల్లిగూడెం అర్బన్ : వర్షాకాలంలో సాధారణంగా వచ్చే వ్యాధులపై తల్లులు, బాలింతలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పిల్లలకు వ్యాధులు సోకకండా తగు జాగ్రత్తలు పాటించాలని సీడీపీఓ టీఎల్ సరస్వతి తెలిపారు. స్థానిక 24వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు, బాలింతల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహాల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఇంటి ప్రాంగణంలోని ఖాళీ స్థలాల్లో వర్షపునీరు, మురుగునీరు నిలవకుండా వినియోగించిన నీరు ముందుకు పారేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి ప్రాంగణంలో నీరు నిల్వ ఉంటే మురుగు చేరి దోమలకు ఆవాసంగా మారుతాయని దీంతో దోమలు విజృంభించే ప్రమాదం ఉందన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. అలాగే చేతులను శుభ్రపరుచుకునే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు దుర్గాభవాని, విశాలాక్షి, ఎస్తేరు రాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, ప్రసన్న, అంజనీ, సావిత్రి, భారతి, కవిత, బేబి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు బైక్‌లు ఇస్తే కఠిన చర్యలు

సీఐ నాగరాజు హెచ్చరిక



వాహనాలు తనిఖీ చేస్తున్న పట్టణ ఎస్సై శ్రీనివాస్

తణుకు: మైనర్లకు బైక్‌లు ఇచ్చే తల్లిదండ్రులను బాధ్యులను చేసి వారిపై కేసులు నమోదు చేస్తామని పట్టణ సీఐ ఎం.నాగరాజు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నాగరాజు మాట్లాడుతూ ఇటీవలి కాలంలో నెంబరు ప్లేట్లపై రాజకీయ నేతల పేర్లు, పార్టీల పేర్లు రాస్తున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రవాణాశాఖ నిర్దేశించిన నెంబరు ప్లేట్లు మాత్రమే వినియోగించాలన్నారు. మరోవైపు తణుకు పట్టణంలో సాయంత్రం సమయాల్లో స్పోర్ట్స్ బైక్‌లతో యువకులు పరిమితికి మించిన వేగంతో వెళుతున్నారన్నారు. ఇలాంటి వారిని గురించి బైక్‌లు సీజ్ చేస్తామన్నారు. ఈ సందర్భంగా వాహన పత్రాలు పరిశీలించి పలువురిపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో పట్టణ ఎస్సైలు కె.శ్రీనివాస్, పి.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్లుగీత వృత్తిని ఆధునీకరించాలి

ఏపీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ



గీత కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహమూర్తి

భీమవరం: అందుబాటులో ఉన్న టెక్నాలజీకి అనుగుణంగా కల్లుగీత వృత్తిని ఆధునీకరించి కల్లుగీత కుటుంబాలను ఆదుకోవాలని ఏపీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నర్సింహమూర్తి అన్నారు. మంగళవారం భీమవరం డివిజన్ ఆరు మండలాల గీత కార్మికుల విస్తృత స్థాయి సమావేశం సీఐటీయూ కార్యాలయంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కడలి పాండు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నర్సింహమూర్తి మాట్లాడుతూ కల్లుగీత వృత్తి రక్షణ, ఆధునీకరణ, సంక్షేమం, ఉపాధి, సామాజిక భద్రత కోసం 30 ఏళ్లుగా గీత కార్మిక సంఘం అనేక పోరాటాలు చేసిందని నర్సింహమూర్తి గుర్తు చేశారు. గీత కార్మికులందరికీ ఉచితంగా ద్విచక్ర వాహనాలు ఇవ్వాలని, పేద గీత కార్మికులకు ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టించి ఇవ్వాలని నర్సింహమూర్తి డిమాండ్ చేశారు. సమావేశంలో కొండవీటి శ్రీనివాసరావు, కాగిత రాధాకృష్ణ, తుంగ సాయిబాబు, చింతపల్లి చినవీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రీయ బాల స్వాస్థ్య'పై అవగాహన సదస్సు

చిన్నారుల్లో లోపాలపై ప్రత్యేక సర్వే



అవగాహన సమావేశంలో పాల్గొన్న జిల్లాలోని ప్రభుత్వ వైద్యులు

భీమవరం (ప్రకాశంచౌక్): 0–5 ఏళ్ల చిన్నారులకు వచ్చే లోపాలను సర్వే ద్వారా గుర్తించి సంబంధిత పీహెచ్‌సీ వైద్యులకు తెలియజేయాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ డి.మహేశ్వరరావు అన్నారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ వైద్యులు, స్టాఫ్ నర్సులకు మంగళవారం భీమవరం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నారుల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, అంగ వైకల్యం, అభివృద్ధిలో లోపాలు, పోషకాహారం వల్ల వచ్చే వ్యాధులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను స్పెషలిస్టులకు చూపించి మెరుగైన సేవలు అందించాలన్నారు. సమాచారాన్ని ఆర్‌బీఎస్‌కె యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.భావన, వై.వెంకటేష్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



డెస్కులకు టాప్‌లు లేని దృశ్యం

ఆకివీడు: విద్యార్థులకు అన్ని వసతులూ కల్పిస్తున్నా పాఠశాల యాజమాన్య లోపంతో కనీస వసతులు దూరమవుతోన్నాయి. స్థానిక పులవర్తి లక్ష్మణ స్వామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని కొన్ని తరగతిగదుల్లో డెస్కులు అధ్వానంగా ఉన్నాయి. విద్యార్థులకు తీవ్ర అసౌకర్యం కల్గిస్తున్నాయి. డ్యూయల్ డెస్కులు ఏమైపోయాయో తెలియని దుస్థితి. కొన్ని తరగతి గదుల్లో డెస్కులు లేక విద్యార్థుల బ్యాగ్‌లు, పుస్తకాలు డెస్క్ అరల్లో పెట్టుకుంటున్నారు. రాసుకునేందుకు తీవ్ర ఇబ్బంది కర పరిస్థితి ఏర్పడింది. ఎనిమిది, తొమ్మిదో తరగతి గదుల్లో ఈ దుస్థితి ఉందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. మరి కొన్ని తరగతి గతుల్లో డెస్కులు అర లేక పుస్తకాల బ్యాగ్‌లు కింద పెట్టుకోవలసి వస్తోందని, పుస్తకాలు తీసుకునేందుకు గుంజీలు తీయాల్సి వస్తుందంటున్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు మొదట విడతలోనే డ్యూయల్ డెస్కులు అమర్చారు. తాగేందుకు ఏర్పాటు చేసిన ఆధునిక ఫిల్టర్లు కూడా పని చేయడం లేదు. అన్ని మౌలిక వసతులూ కల్పిస్తున్నా విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నరసాపురం: విద్యార్థులు, యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని నరసాపురం 7 ఆంధ్రా నేవల్ యూనిట్ కమాండర్ సి. రోహిత్‌కుమార్ సూచించారు. మంగళవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని నేవల్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ, నేవల్ కేడెట్స్ పట్టణంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రోహిత్‌కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యం పూర్తిగా పాడవుతుందని అన్నారు. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థులకు అలవాటు పడి విద్యార్థులు, యువత జీవితాలను నాశనం చేసుకోకూడదని చెప్పారు. పంజా సెంటర్ నుంచి పట్టణంలోని బస్టాండ్ వరకూ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో నేవల్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణికోటికి మొక్కలే జీవనాధారం

పెనుగొండ: ప్రాణికోటికి మొక్కలే జీవనాధారమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సిద్ధాంతం సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి) అన్నారు. మంగళవారం సిద్ధాంతం వాకర్స్ అసోసియేషన్, రిటైర్డు ఉద్యోగులు, పంచాయతీ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. గ్రామంలో 200 మొక్కలు వరకూ నాటుతున్నట్లు తెలిపారు. కాలుష్య నివారణకు, ప్రాణికోటి మనుగడకు మొక్కలే కీలకమన్నారు. నక్కా సత్యనారాయణ, టి.రాజారావు, కవులు రమా సత్యనారాయణ, టి.వీర్రాజు, ప్రసాదు, వెన్నపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.